సమస్యలపై ఏకరువు.. పొగడ్తల దరువు

- డివిజన్ల పరిధిలోని సమస్యలను ప్రస్తావించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- పొగడ్తలకే సమయాన్ని వృథా చేసిన జంపింగ్ కార్పొరేటర్లు
- 64 తీర్మానాలకు కౌన్సిల్ ఆమోదం



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు

నెల్లూరు(బారకాసు): దాదాపు 11 నెలల తరువాత జరిగిన నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు సమస్యలపై ఏకరువు పెట్టి పరిష్కరించాలంటూ కోరుతుంటే, వైఎస్సార్‌సీపీలో గెలిచి టీడీపీలోకి వెళ్లిన జంపింగ్ కార్పొరేటర్లు మాత్రం అధికార పార్టీ నాయకులకు పొగడ్తల దరువు మోగించి సమయాన్ని వృథా చేశారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ సమావేశ మందిరంలో మేయర్ స్రవంతి అధ్యక్షతన మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, 54 డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కమిషనర్ సూర్యతేజతో పాటు పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో 73 తీర్మానాలకు సంబంధించిన అజెండాను ప్రవేశపెట్టగా అందులో 64 తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించారు. నాలుగింటిని వాయిదా వేయగా మరో ఐదు తీర్మానాలను రివైజ్ చేయడం జరిగింది.

- సమస్యల పరిష్కారం కోసం చర్చించాల్సిన వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన పలువురు జంపింగ్ కార్పొరేటర్లు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులను పొగుడ్తూ సమయాన్ని వృథా చేశారు. సింహభాగం కార్పొరేటర్లు తమ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ ఏకరువు పెట్టారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది.

ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు

సమావేశం ప్రారంభం నుంచే కార్పొరేటర్లు తమ డివిజన్‌లో పలు సమస్యలు ఉన్నాయి.. వాటి గురించి ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ప్రజాప్రతినిధులమని, తమకు తెలియకుండానే డివిజన్‌లో కమిషనర్, ఇతర అధికారులు పర్యటిస్తున్నారని, దీనిపై పలు సమావేశాల్లో చెప్పినప్పటికీ పెడచెవిన పెడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. డివిజన్లలో ప్రధానంగా అధ్వానంగా పారిశుద్ధ్యం, కుక్కలు, పందులు, ఆవుల బెడద, తాగునీరు, వీధిలైట్లు, ఆక్రమణలు, డ్రెయిన్ కాలువల్లో మురుగు తదితర సమస్యలు అధికంగా ఉన్నాయంటూ కార్పొరేటర్లు ఏకరువుపెట్టారు.

అవకాశం ఇవ్వండి

సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లు తమ సమస్యలపై ప్రస్తావిస్తున్న క్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ జనసేన కండువాతో పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు చేతపట్టుకుని సమావేశంలోకి వచ్చారు. కొంతసేపు వేచి ఉన్న తరువాత నేనొక్కడినే జనసేన నుంచి ఉన్నానని, నాకు ఒకసారి అవకాశం ఇస్తే సమస్యల గురించి ప్రస్తావిస్తానంటూ మేయర్‌ను కోరారు. ఆమె అవకాశం ఇవ్వగా పలు సమస్యలను వివరించి, పరిష్కరించాలని కోరారు.

అందరి సహకారంతో నగరాభివృద్ధి

- మేయర్ స్రవంతి



జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల సహకారంతో అన్ని విభాగాలధికారుల పర్యవేక్షణలో నగరాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తామని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశ అనంతరం మేయర్ మీడియాతో మాట్లాడారు. నగర వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ పనులు ప్రణాళికాబద్ధంగా జరిగేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటామని తెలిపారు. కమిషనర్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో పాటు నగర ప్రజలందరి సహకారంతో నెల్లూరు నగరపాలక సంస్థ ఉన్నతి సాధించేలా సమన్వయంతో కృషి చేస్తామని మేయర్ ఆకాంక్షించారు. కార్పొరేటర్లు వారి డివిజన్లలో ప్రస్తావించిన సమస్యలను, వివిధ అంశాలను పరిష్కరించేందుకు అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆదేశించారు.

గౌరవించడం సంప్రదాయం

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



సభా సంప్రదాయాలు పాటించేలా కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తే మంచిదని ఎమ్మెల్సీ, సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. కౌన్సిల్ సమావేశాలను మూడు నెలలకోసారి నిర్వహించాలన్నారు. ఇందుకోసం మేయర్, కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్ కెనాల్‌కు సంబంధించి రివిట్‌మెంట్ పనులు కొంత పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేసి గ్రీనరీని అభివృద్ధి చేయాలని కోరారు. ప్రస్తుతం అక్కడ వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు పక్కనపెట్టి పసుపు రంగు బంకులను ఏర్పాటు చేసి అధికార దుర్వినియోగం తగదన్నారు. దీనికి మేయర్, కమిషనర్ సమాధానం చెప్పాలన్నారు. ఉదయం 6 గంటలకే హైవే నుంచి భారీ వాహనాలు నగరంలోకి వస్తున్నాయని, దీనివల్ల నగర వాసులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో కలిసి సమస్యలపై మేయర్‌కు మెమోరాండం అందజేశారు.

కార్పొరేటర్ల వాగ్వాదం



నాగార్జున

13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తన డివిజన్‌లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైన విషయాన్ని అధికారులకు తెలియజేస్తున్న నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి జోక్యం చేసుకుని ఆక్రమణలు అనేక ప్రాంతాల్లో జరిగాయని కేవలం టీడీపీ నాయకులపై ఆరోపించడం సరికాదంటూ వ్యాఖ్యానించారు. దీంతో తిరిగి నాగార్జున నా డివిజన్‌లో జరిగిన ఆక్రమణల గురించి అధికారులకు తెలియజేస్తుంటే మధ్యలో నీకెందుకంటూ ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

జగన్ హయాంలోనే అభివృద్ధి

- కార్పొరేటర్ మొయిళ్ల గౌరి



గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే తన డివిజన్‌లో 70 శాతం అభివృద్ధి పనులు జరిగిందని స్పష్టం చేశారు. ఉమ్మారెడ్డిగుంట ప్రాంతానికి ఉమ్మారెడ్డినగర్ పేరుగా మార్పు చేయాలని కోరారు. స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేస్తే మంచిదని కోరుతూ సమస్యలు చెప్పుకుని వాటిని పరిష్కరించుకుంటే ప్రజల్లో మంచి పేరు ఉంటుందని మేయర్‌కు సూచించారు.

క్లుప్తంగా

డ్రైవర్లకు శిక్షణ



శిక్షణ పొందిన డ్రైవర్లు

నెల్లూరు సిటీ : నెల్లూరు–1 డిపోలో హెవీ లైసెన్స్ రెన్యువల్ కోసం ప్రభుత్వ అనుమతితో పెట్టిన డ్రైవింగ్ స్కూల్లో 23 మంది ఆర్టీసీ, ప్రైవేటు డ్రైవర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. జోన్–3 ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, నెల్లూరు రీజియన్ డీపీటీఏ మురళీబాబు, నెల్లూరు–1 డిపో మేనేజర్ (ప్రిన్సిపల్) మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం

నెల్లూరు (టౌన్) : స్థానిక బాలాజీనగర్‌లోని వికాస్ స్కూల్‌లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ రీజనల్ మేనేజర్ ఆంజనేయులు, సీనియర్ మేనేజర్ అజయ్‌నరసింహారెడ్డి, మేనేజర్ మాధవిలత, ప్రిన్సిపల్ జ్యోతిప్రతాప్ పాల్గొన్నారు.

విత్తన ఎంపిక కీలకం



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు సిటీ : రబీ సీజన్‌కు సంబంధించి విత్తన ఎంపిక కీలకమని ఏడీఏ శ్రీనివాసులు అన్నారు. నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లి–1, మాదరాజుగూడూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. మండల ఏఓ నాగమోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు అభిలాష్, ధర్మతేజ, రైతులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతి ఇస్తున్న మేనేజర్ మురళీకృష్ణ

నెల్లూరు సిటీ : నెల్లూరు–బుచ్చిరెడ్డిపాళెం రూట్‌లో తిరిగే ప్రయాణికుల్లో లక్కీడిప్ ద్వారా ముగ్గురు విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్లు డిపో–1 మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. కోవూరుకు చెందిన ఇందిరా నాగలక్ష్మి, బుచ్చికి చెందిన సత్రాజ్, శ్రీనివాసులుకు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు రూ.10ల చార్జీ ఉంటుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

21న ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నెల్లూరు రూరల్: ఈనెల 21, 22వ తేదీల్లో వీఆర్ కాలేజీ మైదానంలో 300 మంది పాస్టర్లు, 500 మంది బృందంతో కలిసి ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నామని కమిటీ నిర్వాహకుడు రెవరెండ్ డి.వినోద్‌ప్రకాష్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం మాట్లాడుతూ ఎవరైనా వేడుకలకు రావచ్చని, అందరూ కలిసి జయప్రదం చేయాలని కోరారు. ఆయనతో పాటు కన్వీనర్ దామవరపు నవీన్ ప్రకాష్ ఉన్నారు.

క్రీడాకారులకు అభినందన



ఫిడే రేటింగ్ సాధించిన క్రీడాకారులతో సుమన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ సాధించిన జిల్లాకు చెందిన ఏడుగురు చెస్ క్రీడాకారులను రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ అభినందించారు. స్థానిక చిల్డ్రన్స్‌పార్క్‌రోడ్డులోని ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ప్రపంచ చదరంగ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల ఫిడే క్లాసికల్ రేటింగ్ టోర్నీ జరిగిందన్నారు. ఇందులో వి.హరీష్‌మన్, పి.సిద్దేష్, టి.ఆయూష్, ఎం.ధార్మిక్‌సాయి, జె.సహస్‌ప్రిన్స్, ఈ.కీర్తిసాయి, కె.సాయిశ్రీహర్ష రాణించారన్నారు. కార్యక్రమంలో కోచ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

లివర్ కేన్సర్‌ను అరికడుదాం



లివర్ మార్పిడి చేయించుకున్న వారితో కలిసి మాట్లాడుతున్న డాక్టర్ రజనీకాంత్

నెల్లూరు(అర్బన్) : పెరుగుతున్న లివర్ కేన్సర్‌లను తొలిదశలో గుర్తించడం ద్వారా అరికట్టవచ్చని చెన్నై గ్లెనిగల్ ఆస్పత్రి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సండే మార్కెట్ వద్ద ఉన్న గ్లెనిగల్ కినిక్‌లో లివర్ మార్పిడి చేయించుకుని ఆరోగ్యంగా ఉన్న వారితో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. లివర్ గట్టిపడి దెబ్బతింటే సిర్రోసిస్‌గా మారి లివర్ కేన్సర్‌లు వస్తున్నాయన్నారు. ఇందుకు విపరీతమైన మద్యం, హెపటైటిస్ బీ, సీ, ఫ్యాటిలివర్‌లు కారణమన్నారు. ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, పొట్టనొప్పి, కామెర్లు లాంటివి ఉంటే లివర్ కేన్సర్ ఉండవచ్చన్నారు. సాధారణ అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షను చేయించుకోవడం ద్వారా సైలెంట్‌గా వచ్చే లివర్ కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించవచ్చన్నారు. ఇలాంటి వారికి లివర్ మార్పిడి చేయడం ద్వారా కేన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చన్నారు.

లివర్ దానం చేసిన బిడ్డలు

నెల్లూరులో సిర్రోసిస్ ఆఫ్ లివర్ జబ్బు వచ్చిన లక్ష్మారెడ్డికి ఏడాది క్రితం ఆయన కుమార్తె సగం లివర్‌ను దానం చేయడంతో లివర్ మార్పిడి చేశామని డాక్టర్ రజనీకాంత్ తెలిపారు. అలాగే నగరానికి చెందిన సత్యనారాయణకు ఆయన కుమారుడు నాలుగు నెలల క్రితం లివర్‌ను దానం చేసి తండ్రిని కాపాడుకున్నారన్నారు. శేషారెడ్డి అనే వ్యక్తికి ఆయన భార్య లివర్‌ను దానం చేసిందన్నారు. ఇప్పుడు వారంతా ఆరోగ్యంగా ఉన్నారని, వారిని పరిచయం చేశారు. సీఎం సహాయనిధి, ఇతర మార్గాల ద్వారా పెద్ద ఖర్చు లేకుండా లివర్‌ను మార్పిడి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సత్యవతి

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రితో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలని కలెక్టర్ ఆనంద్‌ను ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు వై.సత్యవతి కోరారు. ఇటీవల ఎన్నికల్లో గెలిచిన సత్యవతి పానెల్ మెంబర్స్ మంగళవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ ప్యానెల్ సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా సత్యవతి కలెక్టర్‌తో మాట్లాడుతూ రాత్రి విధులు నిర్వర్తించే నర్సులకు రక్షణతో పాటు కనీస వసతులు కల్పించాలని కోరారు. అసోసియేషన్ నాయకులు సుమతి, వసుంధర, నిర్మలజ్యోతి, రాధా, జి.లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పీఎం సోలార్ సూర్యఘర్ పథకంపై నగరంలోని ఏకేనగర్ సబ్‌డివిజన్, రామ్మూర్తినగర్ సబ్‌డివిజన్, వెంకటేశ్వరపురం సెక్షన్ పరిధిలో గాంధీగిరిజన కాలనీ ప్రాంతాల్లోని సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అశోక్, సునీల్‌కుమార్, కిరణ్, అసిస్టెంట్ ఇంజినీర్లు కృష్ణవేణి, లక్ష్మీబాయ్, విజయ్‌కుమార్, సుధాకర్, దామోదర్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగడి సన్నిధిలో విశేష పూజలు



బంగారు పల్లకిలో పేట ఉత్సవం

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ముప్పిరాల నరసింహాచార్యులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా నగరోత్సవం



నెల్లూరు(బృందావనం) : శెట్టిగుంటరోడ్డులోని నాగేంద్రనగర్ పుట్టవీధిలో నాగుల చవితి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి నాగేంద్రస్వామి నగరోత్సవం వేడుకగా సాగింది. బుధవారం అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు కె.శ్రీనివాసులు, సీహెచ్.వెంకటరమణ, కె.సుబ్బానాయుడు, కె.సుబ్బారావు, కె.వెంకటేష్, కె.గురవయ్య తెలిపారు.

15న మహా కార్తీక దీపోత్సవం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్‌లో 15న మహాకార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కార్తీక దీపోత్సవ నిర్వహణపై గణేశ్‌ఘాట్ వద్ద మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గణేశ్ ఘాట్ వద్ద శోభాయాత్ర, గంగాహారతి తదితర విశేష కార్యక్రమాలు జరుగనున్నాయన్నారు. కమిషనర్ సూర్యతేజ, కార్పొరేటర్ కె.విజయలక్ష్మి, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో రెండు వాహనాలకు వేలం రేపు

నెల్లూరు(అర్బన్) : వైద్యశాఖకు చెందిన రెండు పాత జీపులను గురువారం ఈ–వేలం ద్వారా విక్రయిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వివరాల కోసం ఈ–వేలం పోర్టల్ https://konugolu.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని కోరారు. వేలానికి సంబంధించిన నిబంధనలు, సవరణలు, సమయం పొడగింపు తదితర విషయాలను వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని తెలిపారు.

వైద్యశాఖ ఉద్యోగి మృతికి పలువురి సంతాపం

నెల్లూరు(అర్బన్) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అనేక ఆస్పత్రుల్లో ఎంఎన్‌ఓగా పనిచేసి ప్రస్తుతం సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో సోమవారం రాత్రి వినోద్ కుమార్ మృతిచెందడం బాధాకరమని ఏపీ హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్‌కిరణ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ హంస జిల్లా జాయింట్ సెక్రటరీగా, జిల్లా మేల్ నర్సింగ్ ఆర్డర్లీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన వినోద్‌కుమార్ ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

15 మందికి ఆపరేషన్లు

నెల్లూరు సిటీ : నారా లోకేశ్ ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన 15 మందికి మెడికవర్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్లు చేయించుకున్న వారిని ఆయన మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేయించండి

నెల్లూరు(సెంట్రల్) : ఆత్మకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేయించాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు టీడీపీ నేతలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా రాజమన్నార్

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌వీవీఎన్ రాజమన్నార్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో మార్కాపురం ఒకటి. అయితే అక్కడ ఇంకా కళాశాల ప్రారంభం కాకపోవడంతో ఆయన్ను నెల్లూరుకు మార్చారు. ఆయన బాధ్యతలు చేపడితే ఇక్కడ ఎఫ్‌ఏసీ హోదాలో బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ గోవింద రిలీవ్ కానున్నారు.

ఎరువులు, విత్తనాల కొరత రాకూడదు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట) : జిల్లాలో విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల్లో అమలవుతున్న కార్యక్రమాలు, లక్ష్య సాధనపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఎంఐపీ పథకం కింద మంజూరైన మైక్రో ఇరిగేషన్ పరికరాలకు రైతుల వాటాను చెల్లించే విధంగా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బ్యాంకర్లు, అధికారులు మత్స్యకార గ్రూపులతో సమావేశాలు నిర్వహించి మెకనైజ్డ్ బోట్లు పొందే విధంగా చైతన్యం తీసుకోవాలన్నారు. డీఏఓ సత్యవాణి, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, మార్కెటింగ్ ఏడీ అనిత పాల్గొన్నారు.

మహిళా వర్సిటీని ఏర్పాటు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమితి నేతలు

నెల్లూరు(బృందావనం) : స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ పేరు మీద నెల్లూరులో మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి కన్వీనర్ బి.సురేంద్రనాథ్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొణకా కనకమ్మకు సంబంధించి రూ.2500 కోట్ల ఆస్తులు నెల్లూరులో ఉన్నాయన్నారు. ఆమె కోరిక మేరకు ప్రాథమిక విద్య నుంచి పీజీ వరకు బాలికలకు ఉచిత విద్య అందించాలన్నారు. సమావేశంలో చెలంచర్ల భాస్కర్‌రెడ్డి, జయప్రకాష్, షేక్.సందానిబాషా పాల్గొన్నారు.

10న కార్తీక మాస వేడుకలు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన 'కార్తీక మాస మహోత్సవ వేడుకలు' నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. సుబేదారుపేటలోని ఆ ట్రస్ట్ కార్యాలయం వద్ద కార్తీక మాస మహోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు పాటలు, నృత్యపోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతి, అవార్డులను అందజేస్తామన్నారు. ఆసక్తి గల కళాకారులు 9వ తేదీలోగా తమ వివరాలను 77299 42548 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. ఎస్.సత్యనారాయణరావు, అహ్మద్‌షఫీ, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నెల్లూరు పొర్లుకట్ట వద్ద నాగళ్ల పరమేశ్వరి పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం) : నాగులచవితి పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నాగుల పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఉన్న నాగశిలల వద్ద, పుట్టల వద్ద మహిళలు క్షీరాభిషేకాలు, విశేష పూజలు, సర్పదోష, శాంతి హోమాలను జరిపించారు. నగరంలోని మూలాపేటలో ఉన్న శ్రీమత్ ద్రౌపతీదేవి సమేత శ్రీకృష్ణధర్మ రాజస్వామి ఆలయంలో.. పొర్లుకట్ట వద్ద ఉన్న నాగళ్ల పరమేశ్వరి ఆలయంలో.. రాయాజీవీధిలోని వెన్నెలకంటి వారి పుట్ట, బాలాజీనగర్ పుట్టవీధిలోని నాగేంద్రస్వామి పుట్ట, నిప్పో సెంటర్‌లోని నాగేంద్రుడి పుట్ట, కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్ వద్ద ఉన్న నాగులపుట్టతో పాటు వివిధ ఆలయాల్లో మహిళలు విశేష పూజలు నిర్వహించారు.

- **నెల్లూరు(వీఆర్సీసెంటర్) :** నగరంలోని వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజనకాలనీ, పునరావాస కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉన్న నాగుల పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు.
- నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న నాగుల పుట్ట వద్ద భక్తులకు అన్నసంతర్పణ, ప్రసాదాలను అందచేశారు.



పూజలు చేస్తున్న మహిళలు



భక్తులకు ప్రసాదాల పంపిణీ